నూతన చట్టాలపై అవగాహన అవసరం

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్పీ నారాయణరెడ్డి, పోలీస్ అధికారులు

వికారాబాద్, జూన్ 13 : నూతన చట్టాలపై పోలీస్ అధికారులందరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం డీజీపీ కార్యాలయం అదేశాల మేరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో తెలంగాణ పోలీసులకు పోలీసు అకాడమీ ఆధ్వర్యంలో భారతీయ న్యాయ సంహితలో కొత్త చేర్పులపై సున్నితత్వం అంశంపై శిక్షణ నిర్వహించారు. వికారాబాద్ పోలీస్ శిక్షణా కేంద్రంలో జిల్లా అధికారుల కోసం ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన చట్టాలు దేశంలో నేర న్యాయ వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొస్తాయని, వీటిని సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నేర విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం, పారదర్శకతను పెంచడం తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలపై..

కులకచర్ల : గ్రామాల్లో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కులకచర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేసేందుకు గ్రామాల వారీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇందుకోసం ప్రణాళిక తయారు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మోత్కూర్‌లో టీబీ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

దోమ, జూన్ 13 : దీర్ఘకాల వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, దోమ పీహెచ్‌సీ డాక్టర్ రజిత అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూర్ సబ్ సెంటర్ పరిధిలోని మైలారం, ఖమ్మం, నాచారం గ్రామాల్లో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ, మధుమేహం, రక్తపోటు, హెచ్ఐవీ తదితర వ్యాధులు సోకకుండా వైద్యుల సలహాలు తీసుకొని ఆరోగ్యాంగా ఉండాలని సూచించారు. 15 రోజుల పైబడి దగ్గు జ్వరం ఉంటే తప్పకుండా తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణైన పేషెంట్లకు ప్రతినెలా పౌష్టికాహారం కోసం రూ.వెయ్యి వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో ప్రభు లింగం, ఎంఎల్‌హెచ్‌పీ అఖిల్, ఎస్‌టీఎస్ గోపాల్, టీబీ హెల్త్ విజిటర్ రాజు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను సదస్సుల్లోనే పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఎన్నేపల్లిలో రెవెన్యూ సదస్సు

ఎన్నేపల్లి రెవెన్యూ సదస్సులో రికార్డును పరిశీలిస్తున్న లెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 13 : భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఎన్నేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా వివరాలుఅడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నమోదు రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ అధికారి వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను గుర్తించాలి

వికారాబాద్ : గ్రామాల్లో పుట్టుకతోనే కాకుండా ఇతరత్రా కారణాలతో వైకల్యం పొందిన వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు చేయించడానికి ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఆకర్ ఆశ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికారాబాద్, పూడూరు మండలాల వైద్యాధికారులు, ఐసీడీఎస్ పీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు ముందస్తు వైకల్య పరీక్షలు నిర్వహించేందుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైకల్యం ఉన్న వారికి శస్త్ర చికిత్సలతో పాటు ప్లాస్టిక్ సర్జరీలు ఉచితంగా చేయడానికి ముందుకొచ్చిన ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి వెంకటరమణ, ఉపవైద్యాధికారి ప్రవీణ్, వైద్యాధికారులు శాలిని, నిఖిల్, మహ్మద్, సౌమ్య, కృప, దేవిక పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్‌లో భూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల, జూన్ 13 : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు చేపట్టగా సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అనంతరం భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు ఏ సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తునూ పరిశీలించి.. పరిష్కరించాలి

మాదిరెడ్డిపల్లిలో రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో వాసు చంద్ర

నవాబుపేట, జూన్ 13 : గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో అందజేసే ప్రతి దరఖాస్తునూ పరిశీలించి.. పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆర్‌డీవో వాసుచంద్ర సూచించారు. మండల పరిధిలోని ఆర్కతల, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదస్సులో ఫిర్యాదుదారులు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించి ఏ లెవల్‌లో పరిష్కారం అవుతుందో వారికి తెలియజేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది.. ఫిర్యాదుదారులతో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. వారు ఇచ్చే దరఖాస్తులపై సంతృప్తి చెందేలా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బుచ్చయ్య మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల పనితీరుపై ఆర్‌డీవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ లు రజిత, రాజు, జూనియర్ అసిస్టెంట్ పరమేశ్, శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది ఫారుక్ పాల్గొన్నారు.

రేషన్ కోసం తప్పని నిరీక్షణ

ఏర్పుమల్లలో రేషన్ బియ్యం కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

బొంరాస్ పేట, జూన్ 13 : బొంరాస్ పేట, దుద్యాల మండలాల పరిధిలో రేషన్ బియ్యం కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న సందర్భంగా లబ్ధిదారులు గంటల తరబడి రేషన్ షాపుల దగ్గర లైన్‌లో నిల్చుంటున్నారు. ఒక్కో రేషన్‌కార్డు దారు నుంచి మూడు సార్లు వేలిముద్రలు తీసుకుంటున్నారు. కొందరి వేలి ముద్రలు రాకపోవడం, మిషన్‌లో సాంకేతిక సమస్యలు, విద్యుత్ కోతలతో ఆలస్యం అవుతున్నదని వారు పేర్కొంటున్నారు.

లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత

పరిగి : ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 13 : మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 269 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన నిరుపేదలకు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, మాజీ చైర్మన్లు రఘునాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు పెంటయ్య శ్రీనివాస్ రెడ్డి షకీల్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల : మండల పరిధిలోని పలు గ్రామాల లబ్ధిదారులకు యాలాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం 408 మందికి ఇండ్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్ : మండల కేంద్రంలో శుక్రవారం 461 మంది లబ్ధిదారులకు ఇందరమ్మ ఇండ్ల మంజూరు ప్రతాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మండలం చాలా వెనుకబడి ఉండడంతో ఎక్కువ ఇండ్లు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేశ్ మహారాజ్, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, మాధవ్‌రెడ్డి, ఫాక్స్, ఏఎంసీ వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటేష్ మహారాజ్, శంకర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాన్యానాయక్ తండాలో..

బొంరాస్ పేట : దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామ పంచాయతీలోని నాన్యానాయక్ తండాలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుక్రవారం అధికారులు, నాయకులు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు పోశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వరుణ్, పంచాయతీ కార్యదర్శి కిశన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల : ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలి

వికారాబాద్ బస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వికారాబాద్, జూన్ 13 : ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజు కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు తేజ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల బస్ పాసుల చార్జీలు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే చాలా మంది పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులందరికీ ఉచితంగా బస్ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రెహాన్ సిద్ధు, అభిషేక్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని చింతలపల్లిలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్.. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు పార్టీ నాయకులు, ఉప్పల ట్రస్టు సభ్యులు, ఆశ కార్యకర్తలతో కలిసి మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కుమార్, యాదయ్య, నాయకులు జంగయ్య, అశోక్, బాలరాజ్, మహేశ్, గిరి, ఆశ వర్కర్లు శామంత, అనిత తదితరులు పాల్గొన్నారు.

-ఆమనగల్లు, జూన్ 13

విజయ డెయిరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళిని బీఎంసీ యూ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

- కేశంపేట, జూన్ 13

మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో శుక్రవారం ఎన్నుకున్న బీసీ సేన మహిళా కమిటీ సభ్యులతో బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ తదితరులు - నందిగామ, జూన్ 13

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

- డీఈవో రేణుకాదేవి
- పాఠశాలల్లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

దోమ : మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో రేణుకాదేవి

పూడూరు: కంకల్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

మర్పల్లి : పంచలింగాల్ పాఠశాలలో విద్యార్థుల అక్షరాభ్యాసంలో కేశవులు

బొంరాస్ పేట : సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

దోమ, జూన్ 13 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూరులో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాన్ని ప్రధానోపాధ్యాయుడు పాండు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉచిత పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఏఐ కంప్యూటర్ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల పరిధిలోని ఐనాపూర్ బొంపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంవో రామ్ మస్తాన్, సీఎంవో రజని, పాఠశాలల చైర్మన్లు రేనమ్మ, సుజాత, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బాలరాజు, ఐనాపూర్ పాఠశాల హెచ్ఎం మేగ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్ : బడిబాటలో భాగంగా శుక్రవారం స్థానిక జీసీపీఎస్‌లో ఎంఈవో రాంరెడ్డి విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆటపాటలతో విద్యార్థులకు బోధన కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ హక్, సుహాసిని, అంగన్‌వాడీ టీచర్లు యాదమ్మ, అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

పూడూరు : తల్లిదండ్రులు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో సాయి రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండల పరిధిలోని కంకల్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం ఎంపీడీవో పాండుతో కలిసి ఎంఈవో స్థానిక హెచ్ఎం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులను అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పీరంపల్లిలో..

కులకచర్ల : మండల పరిధిలోని పీరంపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలివేలు, పాఠశాల కమిటీ చైర్పర్సన్ శ్రీలత జంగయ్య, బీఆర్ఎస్ మండల నాయకులు కొత్త బలిజ రాజు, మాజీ సర్పంచ్ గొల్ల సత్యనారాయణ, సీసీ లక్ష్మి, వీవోఏ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచలింగాల్‌లో..

మర్పల్లి : మండల పరిధిలోని పంచలింగాల్ పాఠశాలలో హెచ్ఎం కేశవులు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నాందాపూర్‌లో..

బొంరాస్‌పేట : మండల పరిధిలోని నాందాపూర్ పాఠశాలలో క్లస్టర్ జీహెచ్ఎం రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో హెచ్ఎం రామయ్య విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం నూతన పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు,ఏకరూప దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శోభారాణి, మల్లికార్జున్, రాములు, ముకుంద, పాఠశాల ఉపాధ్యాయులు జీవన్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

జిన్‌గుర్తిలో..

తాండూర్ రూరల్, జూన్ 13 : మండల పరిధిలోని జినుగుర్తి ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్ ఉత్తమ్ చంద్ ముదిరాజ్ విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మృత్యుంజయ స్వామి, పలువురు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజాపూర్‌లో..

ధారూరు : మండల పరిధిలోని రాజాపూర్ పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం అపర్ణ సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం యూనిఫామ్స్, నోట్ బుక్స్, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆయా శంకరమ్మ, సీసీహెచ్‌లు లక్ష్మి, మల్లేశ్, ఏఏపీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముజాహిద్‌పూర్‌లో..

కులకచర్ల : మండల పరిధిలోని ముజాహిద్ పూర్‌లో విద్యార్థులకు నోటు బుక్స్, పుస్తకాలు అందజేసి, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల : పీరంపల్లిలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

ధారూరు : రాజపూర్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

కొడంగల్ : విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో రాంరెడ్డి

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందజేయాలి

కొడంగల్, జూన్ 13 : రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సాగు యంత్రాలు సబ్సిడీపై అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ముందుగానే ప్రారంభమైన నేపథ్యంలో రైతులందరూ ఎంతో ఆశతో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకరాకపోవడంతో వారు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలతో మోసపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందజేసే వారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ఈ పథకాలను అమలు చేయాలని పేర్కొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

మర్పల్లి, జూన్ 13 : కొత్తగా పట్టాపాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 5 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకానికి ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని, రైతులు పటాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ పత్రాలను ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు..

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పరిగి, జూన్ 13 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పరిగి మండల పరిధిలోని సయ్యద్ మల్కాపూర్ గ్రామ సమీపంలో గురువారం జరిగింది. పరిగి ఎస్సై సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. సయ్యద్ మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్యాట నర్సింహులు (30)ను గురువారం రాత్రి 11గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహులు మృతిపై విచారణ చేపట్టాలని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.